క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం వద్ద ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గాడి ప్రసాద్, శారద ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా చేపట్టి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

29న మండల సమావేశం

బొబ్బిలిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ సోమవారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి పండుగ


పూజలు చేస్తున్న భక్తులు

వంగర: మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లి పండుగ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామస్తులంతా గ్రామదేవత ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి అభిషేకాలు చేశారు. పసుపు కుంకుమతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, స్నేహితులు, బంధువులతో గ్రామంలో సందడి నెలకొంది.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రాచారం

బాడంగి: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ సభ్యులు, త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు మండలంలోని భీమవరం, ముగడ గ్రామాలలో త్రైతసిద్ధాంత భవద్గీతపై సోమవారం ప్రచారం చేపట్టారు. గురు, శిష్యుల సంబంధాన్ని, త్రైత సిద్ధాంతంలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి చైర్మన్ రామినాయుడు, సభ్యులు కె.గణేష్, రామ్‌నాయుడు, సూరపు నాయుడు, గుండ కృష్ణ, శ్యామ్, రమేష్, లక్ష్మి, రమణమ్మ, కొండమ్మ, తదితరులుపాల్గొన్నారు.

రుణాల రికవరీకి చర్యలు

వంగర: మండల మహిళా సమాఖ్య ద్వారా మహిళలకు అందజేసిన వివిధ రకాల రుణాల రికవరీకి అధికారులు చర్యలు చేపడుతున్నారు. క్లస్టర్ పరిధిలోని సీసీలు గ్రామాల్లో పర్యటించి స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ వంటి రుణాలు వసూళ్లు చేయాలని ఏపీఎం మీసాల చక్రపాణి ఆదేశించారు. అదేవిధంగా కొత్తగా రుణాలు మంజూరు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

కైలాం గ్రామ సర్పంచ్ మృతి

మెంటాడ: మండలంలోని కైలాం గ్రామ సర్పంచ్ గండి శ్యామలాదేవి ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆమె భర్త గండి రవి మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర వద్ద పీఏస్గా పనిచేశారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామారావు, నాయకులు రత్నాకర్, ఈశ్వరరావు తదితరులు ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

వినతుల స్వీకరణ

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందినట్లు ఎంపీడీఓ సాల్మాన్‌రాజ్ తెలిపారు. అరసాడలో రోడ్డు ఆక్రమణలు నివారించాలని, అరసాడలో భూసమస్య పరిష్కరించాలని కోరుతూ వినతులు అందినట్లు చెప్పారు. వంగర నుంచి మరో ఫిర్యాదు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ లోపింటి త్రినాథ్, ఎంఈఓ వై.దుర్గారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి చర్యలు

రాజాం: రాజాం మున్సిపాల్టీతో పాటు మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులందరికీ కొత్త పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓలు బి.ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో భద్రపరిచిన పుస్తకాలను సోమవారం పలు పాఠశాలలకు తరలించారు. స్టూడెంట్ కిట్స్‌తో పాటు పుస్తకాలు అందజేయనున్నట్లు చెప్పారు. రెండో విడతలో మరికొన్ని పుస్తకాలు రావాల్సి ఉందని, వాటి కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆధ్యాత్మిక గ్రామం

కొండపాలవలస

- గ్రామంలో తొమ్మిది ఆలయాల నిర్మాణం
- భక్తుల తాకిడితో నిత్యం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం


ఆంజనేయస్వామి విగ్రహం

రామభద్రపురం: ఆ ఊరంతా ఆలయాలే. ఎల్లప్పుడూ భక్తుల తాకిడితో కళకళలాడుతూ ఉంటాయి. గ్రామంలో నిత్యం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. మండలంలోని నాయుడువలస పంచాయతీ మధుల గ్రామమైన కొండపాలవలసలో గ్రామానికి చెందిన పాట్నూరు సత్యం ఒకే చోట తొమ్మిది ఆలయాలు నిర్మించి దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయాల నిర్మాణానికి అవసరమైన నిధులను దాతల నుంచి విరాళాలుగా సేకరించారు. ఇలా సుమారు రూ.75 లక్షలు సేకరించి ఆ నిధులతో ఈశ్వర ఆలయం, రాధాకృష్ణ ఆలయం, లక్ష్మీగణపతి ఆలయం, సూర్యభగవానుడి ఆలయం, సీతారాముల ఆలయం, షిర్డీసాయి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, కొండకెంగువ దేవడుబాబు ఆలయం, గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయంతో


లక్ష్మీ గణపతి ఆలయం


రాధాకృష్ణ, సూర్యభగవానుని ఆలయం

పాటు సాయి సత్యయోగానంద ఆశ్రమాన్ని నిర్మించారు. 2014 భీష్మ ఏకాదశి రోజున గ్రామ శివారులో ఉన్న కోనేటి వద్ద శంకుస్థాపన చేసి నిర్మాణాలను ప్రారంభించారు. 2017 జూన్‌లో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్తరాంధ్ర సాదుపరిషత్ వేదపండితులు, కాశీ నుంచి పీఠాధిపతులు వచ్చి ఆలయాల్లో దేవతామూర్తిల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. కోనేటి చుట్టూ ఆలయాలు ఉండటంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొని ఉంటుంది. ఏటా కార్తీకమాసంలో స్థానికులు, పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.


ఈశ్వర ఆలయం


గ్రామదేవత పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎలా వెళ్లాలంటే..

రామభద్రపురం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయాలు ఉన్నాయి. రామభద్రపురం నుంచి బాడంగి, రాజాం వైపు వెళ్లే బస్సులు గాని, ఆటోల్లో గాని వెళ్లవచ్చు.

మా గ్రామస్తులు చేసుకున్న పుణ్యం



తొమ్మిది ఆలయాలు, ఆశ్రమం ఒకే చోట నిర్మించి మా గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారు. మా గ్రామ ప్రజలు చేసుకున్న పుణ్యం. ఆలయాలన్నీ ఒకే చోట ఉండడంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారు.
– బి.శ్యామల, టీచర్, కొండపాలవలస, రామభద్రాపురం మండలం

ఆలయాల అభివృద్ధికి నావంతు కృషి



ఆలయాల నిర్మాణంతో కొండపాలవలసకు గుర్తింపు వచ్చింది. ఆలయాల నిర్మాణానికి నావంతు సాయంగా దాదాపు ఒక లక్ష వరకు అందించారు. అలాగే విఘ్నేశ్వర ఆలయం నిర్మాణం, ఆలయాల ప్రాంగణం చుట్టూ పూల మొక్కలు వేయాలని సంకల్పించుకున్నాను. ఆలయాల అభివృద్ధికి నావంతు కృషి చేస్తాను. – లెంక శ్రీనివాసరావు, గ్రామపెద్ద, కొండపాలవలస

గురువు దేవుడుబాబు ఆశయానికి అనుగుణంగా..



నా గురువు కొండకెంగువ దేవుడుబాబును ఆదర్శంగా తీసుకొని శిష్యుడుగా ఆయన ఆశయానికి అనుగుణంగా ఆలయాలను నిర్మించాను. ఒక్క రూపాయి కూడా నా సొంత నిధులు వెచ్చించకుండా గ్రామ ప్రజలు, దాతల సహకారంతో ఆలయాలు నిర్మించగలిగాను. – సాయిసత్యానందస్వామి, కొండపాలవలస, రామభద్రపురం మండలం

మట్టి నమూనాల సేకరణ

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో మట్టినమూనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల పొలాల నుంచి సోమవారం మట్టి నమూనాలు సేకరించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో 1080 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతీ ఆర్బీకే పరిధిలో 50 నమూనాలు చొప్పున సేకరిస్తున్నట్లు చెప్పారు. వాటిని ల్యాబ్‌కు పంపి అందులోని రసాయనాలను విశ్లేషించనున్నట్లు పేర్కొన్నారు. వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.


పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

శ్మశానానికి స్థలం కేటాయించరూ..

బొబ్బిలి: గ్రామంలో శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని కోరుతూ గదబవలస గ్రామస్తులు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. బాడంగి మండలం గదబవలస గ్రామానికి గతంలో వేగావతి నది ఒడ్డున శ్మశానం ఉండేదని, క్రమేపీ నది వరద పోటువల్ల ఆ స్థలం కొట్టుకుపోయిందని వివరించారు. ప్రస్తుతం శ్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో శ్మశానం కోసం స్థలం కేటాయించాలని వారంతా కోరారు.


ఆర్డీఓ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న గదబవలస గ్రామస్తులు

95 శాతం వరి విత్తనాలపంపిణీ పూర్తి


రేగిడి: బూరాడ ఆర్‌బీకేలో విత్తనాల విక్రయాలపై ఆరా తీస్తున్న ఏఓ

బాడంగి: మండలంలోని రైతుభరోసా కేంద్రాల ద్వారా 95 శాతం మేర రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. మండలానికి మొత్తం 1343.3 క్వింటాళ్ల వరి విత్తనాలు తెప్పించామని, అందులో 1275 క్వింటాళ్ల విత్తనాలను రైతులు పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు 184.18 క్వింటాళ్ల రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

రేగిడిలో..

రేగిడి: ఈఏడాది ఖరీఫ్‌కు అవసరమైన వరి విత్తనాలు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నాయని, కావావల్సిన రైతులు వాటిని తీసుకెళ్లాలని వ్యవసాయశాఖ ఏఓ మురళీకృష్ణ అన్నారు. మండలంలో అంబాడ, బూరాడ తదితర గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో విత్తనాల పంపిణీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది 1121, స్వర్ణ రకాల విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధిపై అవగాహన

సంతకవిటి: బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల పంటను ఆశించే తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సోమవారం రైతులకు బీజామృతంతో విత్తనశుద్ధి ఎలా చేయాలో వివరించారు. ఒక బకెట్ నీటిలో 5 కిలోల ఆవుపేడను గుడ్డలో కట్టి కర్ర సహాయంతో వేలాడదీసి అందులో ఆవు మూత్రం, పుట్టమన్ను, గవ్వ సున్నం వేసినట్లైతే బీజామృతం తయారవుతుందన్నారు. దీన్ని విత్తనాలపై పిచికారి చేయడం వల్ల విత్తనాలపై ఉన్న వ్యాధికారక శిలీంద్రాలు నశిస్తాయన్నారు.

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, గుళ్లపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతం తయారీపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఐదుకిలోల ఆవుపేడ, మూత్రం, 200 గ్రాముల ఇంగువ ద్రావణం, 150 గ్రాముల సున్నాన్ని కలిపి నాలుగురోజుల పాటు నిలువ చేసి వడగట్టడం ద్వారా జీవామృతాన్ని పొందవచ్చన్నారు. ఆ ద్రావణంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా పంట తెగుళ్లను నివారించవచ్చన్నారు.


సంతకవిటి: బీజామృతంతో విత్తన శుద్ధి ఎలా చేయాలో వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సమన్వయంతో పనిచేయాలి

మెంటాడ: పారిశుధ్యం, క్లోరినేషన్ పనులు నిర్వహించేటప్పుడు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ లక్ష్మీబాయ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులను చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించాలని సూచించారు.

29న గురుకుల ప్రవేశ పరీక్ష

రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 6 నుంచి 9 తరగతి వరకూ మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

ప్రజల నుంచి 'స్పందన' కరువు

బొబ్బిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన ప్రజాస్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. అధికారుల వైఫల్యమో లేక తమ సమస్యలపై ప్రభుత్వం నుంచి ఇప్పుడే స్పందన రాదేమోనన్న అనుమానమో కానీ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా స్పందనకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు.

గడువు పొడిగింపు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-మద్రాస్ నిర్వహించే హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు జూలై 15 వరకు గడువు పెంచినట్లు రాజాంకు చెందిన హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ స్థాయి వరకూ ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 99499 17365ను సంప్రదించాలని కోరారు.

కందకాల ఏర్పాటుపై రైతుల ఆసక్తి

రేగిడి: ఉపాధిహామీ పథకంలో భాగంగా అమలు చేస్తున్న కందకాల ఏర్పాటు పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఉంగరాడ, గుళ్లపాడు, సంకిలి గ్రామాల్లో రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. తాము సాగుచేస్తున్న జీడి, మామిడి తోటల్లో ఫారం పాండ్ల తవ్వకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానం ద్వారా వర్షపునీరు తోటలకు మళ్లించవచ్చని రైతులు అంటున్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

తెర్లాం: మండలంలోని సతివాడ గ్రామంలో పాడైన తాగునీటి బోర్లకు సోమవారం మరమ్మతులు చేయించారు. బోర్లు పాడవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడేవారు. సమస్యను గ్రామ సర్పంచ్ పల్ల జానకీ రామ్ ప్రసాద్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సోమవారం గ్రామానికి చేరుకుని పాడైన బోర్లను బాగుచేశారు. ప్రజలు బోర్లను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సర్పంచ్ కోరారు.

మాదిగ జనజాతరను జయప్రదం చేయండి

బొబ్బిలి: ఎమ్మార్పీఎస్ ఉద్యమ పురిటిగడ్డ అయిన ప్రకాశం జిల్లా ఈదుమూడిలో వచ్చే నెల 7న నిర్వహించే మాదిగ జనజాతర మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కోకన్వీనర్ పెంకి సుధాకర్ పిలుపునిచ్చారు. జనజాతరకు సంబంధించిన కరపత్రాలను బొబ్బిలిలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురగాల లక్ష్మణరావు, బొబ్బిలి ఇన్‌ఛార్జి గర్భాపు రమేష్, మండల అధ్యక్షుడు పిల్లి శంకరరావు, పట్టణ అధ్యక్షుడు అరసాడ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సాంబమసూరి మరి లేనట్టే..!


ఆగూరు ఆర్‌బీకే వద్ద వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- వాటి స్థానంలో ఎంటీయూ 1224 రకం విత్తనాల పంపిణీ
- ఆర్బీకేల్లో అరకొరగా విత్తనాలు
- ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్న రైతులు

రాజాం: ఈ ఏడాది ఖరీఫ్ సాగులో సాంబమసూరి(బీపీటీ-5204) రకం విత్తనాల పంపిణీని ప్రభుత్వం నిలుపుదలచేసింది. సన్నరకానికి చెందిన ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం కొత్త వరి వంగడాలను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది 1224 రకం విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా రైతులకు పంపిణీ చేస్తోంది. ఈ కొత్త రకం వరి వంగడాలు సంబమశూరి మాదిరిగానే ఉంటాయి. నియోజకవర్గంలో ప్రతీ మండలానికి కేవలం 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే సాంబమసూరి రకం విత్తనాలను పంపిణీ చేయగా, అవి కూడా ఆయా మండలాల్లో అధికారం చెలాయించే పెత్తందారీలకు మాత్రమే అందాయి. సాధారణ రైతులకు ఈ విత్తనాలు అందకపోవడంతో వాటి స్థానంలో 1224 రకం విత్తనాలు కొనుగోలుచేసి సాగుకు సిద్ధమౌతున్నారు. ఈ పంట కూడా 125 నుంచి 130 రోజులు వ్యవధిలో చేతికి అందివస్తుంది. మరికొంతమంది రైతులు శ్రీధృతి విత్తనాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

అరకొరగానే..

ఈ ఏడాది ఆర్‌బీకేలు ద్వారా పంపిణీ చేస్తున్న విత్తనాలు అరకొరగానే రైతులకు అందుతున్నాయి. రైతులు కావాల్సిన విత్తనాలు లేక పోవడంతో ప్రత్యామ్నాయ మార్గంలో విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. గతంలో కంటే ఈఏడాది ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ ద్వారా ఎక్కువగా విత్తనాలు విక్రయాలు జరుగుతుండగా, మరికొన్ని చోట్ల రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలను సాగుకు వినియోగిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ద్వారా శ్రీధృతి-1121, స్వర్ణమసూరి, ఎంటీయూ 1224 రకం విత్తనాలు ఎక్కువగా పంపిణీ జరిగాయి. నియోజకవర్గంలో 10340 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు తెలిపారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి: ఎంఈఓ

తెర్లాం: 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. తెర్లాంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లలు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ, పీఎం పోషణ, మధ్యాహ్న భోజన వంటలు, తాగునీటి సౌకర్యం, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరంలో బడిఈడు పిల్లలందరినీ గుర్తించి వారందరూ బడిలో చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని, మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని సూచించారు. పాఠశాలల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు.


విద్యార్థితో తెలుగు పదాలు చదివిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

యువత మత్తుకు బానిస కావద్దు

వంగర: యువత మత్తుకు బానిస కావద్దని ఎస్సై వై.వి.జనార్దన్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య అక్రమ సరఫరా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, కొకైన్ వంటివి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్యం పాడవ్వడంతో పాటు జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు, అధ్యాపకులు తూలుగు ఈశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

రేగిడిలో..

రేగిడి: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై ఇ.శ్రీనివాసరావు సూచించారు. ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల వెచ్చించి విద్యార్థులను చదివిస్తుందని, ప్రతీ ఒక్కరు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వంగర: మాట్లాడుతున్న ఎస్సై వై.వి.జనార్దన్

కొలతల ప్రకారం పని చేయాలి

సంతకవిటి: ఉపాధిహామీ పనులను సక్రమంగా చేపట్టాలని, నిర్దేశించిన కొలతల మేరకు పనులు పూర్తిచేస్తే గరిష్ఠ వేతనం అందుతుందని ఏపీఓ ఆర్.హరనాథరావు అన్నారు. మండలంలోని మండాకురిటి గ్రామంలో మద్దువలస లింక్ కెనాల్‌లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వేతనదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పనులు సక్రమంగా చేపట్టాలని, సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట టీఏ శంకరరావు, ఎఫ్ఏ నారాయనరావు, మేట్లు ఉన్నారు.

బాధ్యతగా పనులు చేపట్టాలి

రేగిడి: ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను బాధ్యతగా చేపట్టాలని ఏపీఓ హరనాథరావు సూచించారు. మండలంలో తోకలవలస, వావిలవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులను సోమవారం ఆయన పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేసి పనుల వివరాలు సేకరించారు.


రాజాం సిటీ: బొద్దాంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం

సమయపాలన పాటించాలి

రాజాం సిటీ: ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులంతా సమయపాలన పాటించాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండలంలోని బొద్దాం చిన్నచెరువులో చేపట్టిన ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. ప్రతిరోజు రెండు పూటలా పనులకు హాజరై ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేయాలన్నారు. అప్పుడే రూ.300లు వేతనం గిట్టుబాటు అవుతుందని సూచించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

రాజాం సిటీ: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఇందుకోసం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బావులు, మంచినీటి వనరులను క్లోరినేషన్ చేయాలని, కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. అంతకుముందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా.. రెండు వినతులు అందాయి. కంచరాంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని, రాజయ్యపేట నుంచి పింఛన్లకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

డి.గదబవలసలో పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని డి.గదబవలసలో సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు పర్యవేక్షణలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను, చెత్తాచెదారాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రజలు వీధుల్లో, కాలువల్లో చెత్త వేయొద్దని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.


రాజాం సిటీ: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు